సాక్షి
గుంటూరు
బుధవారం । 30 । అక్టోబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 50915 క్యూసెక్కులు వచ్చిచేరుతుంది. దిగువకు 44274 క్యూసెక్కులు వదిలారు.



విద్యార్థులకు పతకాలు

కర్లపాలెం: చింతాయపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. వారిని పాఠశాల హెచ్ఎం టి.వెంకటరాజు, పీడీ ఎం.గోపి అభినందించారు.



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన ప్రతిపాటి ఆరుష్ వెంకట్ కుటుంబం రూ.1,00,116 విరాళం అందజేసింది.

బీమా భారం రైతులపైనే!

- అన్నదాతలపై చంద్రబాబు సర్కారు మరో పిడుగు
- గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకానికి మంగళం
- ఆపదలో ఆదుకోకుండా భారం మోపడంపై రైతుల మండిపాటు

గత ప్రభుత్వం చెల్లించిన ఉచిత పంటల బీమాలో లబ్ధి ఇలా..

సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
2019	11,948	10.62
2020	27,743	15.74
2021	25,236	37.95
2022	14,542	4.16



సాక్షి ప్రతినిధి, గుంటూరు/కొరిటెపాడు : 'వ్యవసాయం దండగ' అంటూ గతంలో వ్యాఖ్యానించిన చంద్రబాబు రైతు వ్యతిరేక విధానాలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే రైతుల నడ్డి విరిచేందుకు సిద్ధమయ్యారు. 9 గంటల ఉచిత కరెంటుకు కోతలు విధిస్తూ రైతులకు వాతలు పెడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసినా అన్నదాత సుఖీభవ పథకం ఊసే లేకుండా పోయింది. సాయం కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. అన్నదాతలపై పైసా భారం పడకుండా గత ప్రభుత్వం ఐదేళ్లు విజయవంతంగా అమలు చేసిన 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా'కు కూడా మంగళం పాడేందుకు తాజాగా సిద్ధమయ్యారు. కూటమి ప్రభుత్వ పాలనలో తమకు అప్పులు తప్ప ఆదాయం లేదని రైతులు వాపోతున్నారు.

2019 ఖరీఫ్ నుంచి..

రైతుపై ప్రీమియం భారం పడకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో 2019 ఖరీఫ్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ–క్రాప్ నమోదు ప్రామాణికంగా సాగు విస్తీర్ణం అంతటికీ రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది, దీని వల్ల బీమా గురించి రైతులకు ఇబ్బందులు తప్పేవి. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా పథకం వర్తించడంతో పంటలకు నష్టం వాటిల్లినప్పుడు రైతులతో పాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గుంటూరు జిల్లాలో 79,469 మంది రైతులకు రూ.68.47 కోట్ల పరిహారాన్ని చెల్లించారు.కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పూర్తయినా రైతుకు ఎలాంటి సాయం అందించని చంద్రబాబు ప్రభుత్వం నేడు ఉచిత పంటల బీమా పథకానికి కూడా మంగళం పాడేసింది. అక్టోబర్ మొదటి నుంచి ప్రారంభమైన రబీ పంటలకు సంబంధించి అన్నదాతలపై బీమా ప్రీమియం భారం మోపింది. గత ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పైసా ప్రీమియం చెల్లించకుండా ఉచిత బీమా పథకం అమలుతోపాటు పెద్ద ఎత్తున పరిహారం తీసుకుంటూ ప్రశాంతంగా ఉన్న రైతులపై ఇప్పుడు ఒక్కసారిగా పిడుగు పడింది. ఇక నుంచి ప్రీమియం కడితే తప్ప బీమా వర్తించదని బాబు సర్కారు తేల్చిచెప్పింది. అలాగే ఈ–క్రాప్, ఈ–కేవైసీ కూడా తప్పనిసరి చేసింది. పంటల బీమా పథకంపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రీమియం కింద బీమా పథకం అమలులోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించారు.

డిసెంబర్ 15 లోపు ప్రీమియం చెల్లించాలి..

ఈ రబీలో ఫసల్ బీమా కింద మండలం యూనిట్‌గా జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర, పప్పుశనగ పంటలను నోటిఫై చేశారు. వాతావరణ బీమా కింద గుంటూరు జిల్లాలో రబీలో ఒక్క పంటను కూడా గుర్తించలేదు. జిల్లాలో గుర్తించిన పంటలు 63,835 హెక్టార్లలో సాగులోకి రావచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జొన్న, పెసర, మినుము, పప్పుశనగ రైతులు తమ వాటా కింద ప్రీమియం రూపంలో 0.25 శాతం, మొక్కజొన్న రైతులు 0.30 శాతం భరించాలి. అంటే జొన్నకు హెక్టారుకు రూ.140 ప్రకారం, మొక్కజొన్న రైతులు హెక్టారుకు రూ.119, పెసర రైతులు హెక్టారుకు రూ.285, మినుము రైతులు హెక్టారుకు రూ.113, శనగ రైతులు హెక్టారుకు రూ.125 వంతున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. డిసెంబర్ 15వ తేదీలోపు బ్యాంకులు, సీఎస్‌సీ, మీ సేవా కేంద్రాలు, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో రైతులు ప్రీమియం చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. అప్‌డేట్ చేసిన ఆధార్‌కార్డులు, 1–బీ అడంగల్, బ్యాంక్ పాసుపుస్తకం, కౌలు రైతులు అయితే సీసీఆర్‌సీ పత్రాలు, ఫోన్‌నంబర్ తదితర వివరాలు సమర్పించి ప్రీమియం కట్టాల్సి ఉంటుంది. పంటలు సాగు చేసినట్లు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి చేశారు.

ఇప్పటికీ పెట్టుబడి సాయం ఊసే లేదు



ఖరీఫ్ సీజన్ ముగిసినా ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ కూడా అమలు చేయలేదు. చంద్రబాబు పాలన ప్రకటనలకే పరిమితం అయింది. సాయం కోసం రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పథకంతో రైతులకు ఒరిగిందేమీ లేదు. 2014–19 టీడీపీ పాలనలో రైతులను ఆదుకోవడంలో అప్పటి ప్రభుత్వం విఫలమైంది. మళ్లీ రైతులను మోసగించే పనికి చంద్రబాబు ఇప్పుడు సిద్ధమయ్యారు. ఇటీవల వర్షాలకు నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం కూడా అందలేదు.

– అందే దిలీప్ కుమార్, కసుకర్రు గ్రామం, పొన్నూరు మండలం

అన్నదాతల ఆగ్రహం..

ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడిన కూటమి ప్రభుత్వం ప్రీమియం రూపంలో భారం మోపడంపై రైతులు మండిపడుతున్నారు. జిల్లాలో రబీ సీజనులో ప్రీమియం చెల్లింపుల ద్వారా రూ.89.52 లక్షలు రైతులపై అదనపు భారం పడనుంది. ఈ క్రమంలో చంద్రబాబు ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక చర్యలపై రైతు సంఘాలు, విపక్షాలు మండిపడుతున్నాయి.

అగ్నిమాపక శాఖపై

విచారణ

సాక్షి కథనానికి అధికారుల స్పందన

సాక్షి ఎఫెక్ట్

పట్నంబజారు: 'సాక్షి' గుంటూరు జిల్లా ఎడిషనల్‌లో మంగళవారం ప్రచురితమైన 'అవినీతి అగ్ని' కథనానికి అగ్నిమాపక శాఖ అధికారులు స్పందించినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేపట్టినట్లు సమాచారం. అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు అధికారులకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు శాఖలో చర్చ నడుస్తోంది. ఇప్పటికే కొంత మంది స్పష్టంగా అవినీతికి పాల్పడ్డారని, వారి సిబ్బంది ద్వారా బాణసంచా దుకాణాలకు ఎన్‌ఓసీలు ఇచ్చే నేపథ్యంలో అక్రమాలు జరిగాయని ఓ నిర్ణయానికి ఉన్నతాధికారులు వచ్చినట్లు సమాచారం. ఈ మేరకు గుంటూరు రేంజ్ పరిధిలోని ఓ ఉన్నతాధికారి సమగ్ర నివేదికను డీజీకి త్వరలో సమర్పించనున్నట్లు సమాచారం తెలుస్తోంది.

మారని తీరు

అగ్నిమాపక శాఖలో దసరా, దీపావళికి సంబంధించి భారీ ఎత్తున అవినీతికి పాల్పడిన కొంత మంది అధికారుల తీరులో ఇప్పటికీ ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం. మంగళవారం సైతం వారి సిబ్బందిని పలు దుకాణాల వద్దకు పంపి తమకు ఈ మేరకు బాణసంచా కావాలంటూ హుకుం జారీ చేసినట్లు వ్యాపారులు చెప్పారు. తెనాలి, గుంటూరు, మంగళగిరిలో పనిచేసి ప్రస్తుతం గుంటూరులో ఉన్న ఓ అధికారి మరోమారు కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధికారుల అండదండలతో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దానికి తగ్గట్లు సదరు అధికారి ఇప్పటికే కొంత మంది వ్యాపారులతో మాట్లాడారని, తన విషయం ఎక్కడా మాట్లాడవద్దంటూ చెప్పిన ఘటనలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

పురస్కారం స్వీకరించిన జీఎంసీ కమిషనర్



నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం స్వనిధి ద్వారా గుంటూరు నగరపాలక సంస్థ.. 24,197 దరఖాస్తులకుగాను బ్యాంక్‌ల ద్వారా 21,594 మంది చిరు వ్యాపారులకు రుణాలు అందించడం ద్వారా దేశంలో తొలి స్థానంలో నిలిచింది. దీంతో మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ చేతులమీదుగా అవార్డ్, ప్రశంసా పత్రాన్ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అందుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో గుంటూరు నగరపాలక సంస్థకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



వరగాని(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మండలంలోని వరగాని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలు అంటేనే తల్లిదండ్రులకు ఎంతో నమ్మకమని చెప్పారు. ప్రతి ఉపాధ్యాయుడు బడిలోని పిల్లలను తమ సొంత బిడ్డల్లా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్య నేర్పాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రతి రోజు అందించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం తినేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. వారి ప్రగతి వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ భూముల్లో అక్రమ నిర్మాణాలు తొలగింపు



తాడికొండ: సీఆర్‌డీఏ భూముల్లో అక్రమ నిర్మాణాలను మంగళవారం అధికారులు తొలగించారు. ఉద్దండరాయునిపాలెం గ్రామంలో లారీలు, ట్రాక్టర్లు నిలిపేందుకు కొంతమంది షెడ్డులు నిర్మించడంతో వాటిని జేసీబీల సాయంతో కూల్చివేశారు. స్వచ్ఛందంగా తొలగించుకుంటామని కొందరు కోరడంతో వెసులుబాటు కల్పించారు. సీఆర్‌డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.విశ్వేశ్వర నాయుడు ఆధ్వర్యంలో తొలగింపు చేపట్టారు. పలువురు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యార్డుకు 43,346 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 43,346 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 41,651 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,200 వరకు లభించింది.



• జీవితమే ఒక దీపావళి





నిశీధిని పారదోలి మనందరి జీవితాల్లో వెలుగులు నింపే పండుగ దీపావళి. అందుకే ఒక్కొక్క దీపాన్ని వెలిగిస్తూ చీకట్లని పారదోలుకుని మార్పులు తెచ్చుకుని గొప్పదైన జీవితాన్ని నిర్మించుకోవాలన్నదే ఈ పండుగ సారాంశం. అందుకే చీకటి వెలుగుల రంగేళి, జీవితమే ఒక దీపావళి అంటూ పండుగను జనజీవితాలకు అన్వయం చేసి చెబుతారు. చిన్నా-పెద్దా తారతమ్యం లేకుండా ఆస్వాదించే పండుగ. నరకాసుర వధతో ఆరంభమయ్యే ఈ పర్వదినం రెండు రోజులపాటు తెలుగు లోగిళ్లలో ఉత్సాహంగా సాగుతుంది. ఇక పిల్లలు టపాసుల కొనుగోళ్లపై ఎక్కువ శ్రద్ధ చూపుతారు. ఖరీదుపెట్టి టపాసులు కొన్నా సీమ టపాకాయలు ఎర్రగా నాజూగ్గా ఉన్నానని బడాయికి పోతాయి. నీటుగా దీటుగా ఉన్నానని ఔటు గర్వానికి పోతుంది. బలంగా, ఒంపుగా ఉన్నాననుకుంటుంది ఆటంబాబు. కానీ వీటన్నిటికీ తెలియదు ఈ దీపావళి నాడు తామంతా ఒక చిన్న అగ్గిపుల్లకు బానిసలమై పోతామని. దీపావళి సందర్భంగా గుంటూరులో బాణసంచా దుకాణాలు భారీగా కొలువుదీరాయి.

– ఫొటోలు, సాక్షి, ఫొటోగ్రాఫర్, గుంటూరు

ఆస్తి కోసం దారుణం

కన్నతండ్రిని చంపిన కుమారుడు



తోక వెంకట రామయ్య మృతదేహం

ప్రత్తిపాడు: ఆస్తి కోసం కొడుకే కన్నతండ్రిని మంచం కోడుతో కిరాతకంగా కొట్టి హత్య చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం .. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడుకు చెందిన తోక వెంకట రామయ్య (60) స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆయన రెండు వివాహాలు చేసుకున్నాడు. మొదటి భార్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండవ భార్యకు సంతానం లేదు. ఈ నేపథ్యంలో మొదటి భార్య కుమారుడు వెంకటకృష్ణ ఆస్తిలో వాటా ఇవ్వాలని తండ్రిని కొంతకాలంగా వేధిస్తున్నాడు. వెంకటకృష్ణకు అతని భార్య కూడా సహకరించేది. ఇద్దరూ కలిసి వెంకట రామయ్యపై ఒత్తిడి తీసుకువచ్చారు. తనకున్న ఎనిమిది సెంట్లులో నాలుగు సెంట్లు కొడుకు, కోడలి పేరుతో ఆయన రాసిచ్చాడు. అయినప్పటికీ సంతృప్తి చెందని కుమారుడు మిగిలిన ఆస్తి కోసం గత కొంతకాలంగా తండ్రితో గొడవ పడుతున్నాడు. కొడుకు, కోడలు కలిసి వెంకటరామయ్యపై కేసులు పెట్టారు. దీంతో వెంకట్రామయ్య సొంత ఇంటిని వదిలేసి వేరే ఇంటికి వెళ్లిపోయాడు. కుమారుడు కూడా భార్య స్వగ్రామానికి వెళ్లిపోవడంతో గొడవలు సర్దుమణిగాయి. వెంకట రామయ్య తిరిగి కోండ్రుపాడులోని సొంత ఇంటికొచ్చి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి అక్కడికి కుమారుడు వచ్చాడు. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లాడు. ఇంతలో వెంకట రామయ్య రావడంతో ఆస్తి విషయమై వాగ్వాదం చోటుచేసుకుంది. వెంకటకృష్ణ మంచం కోడు తీసుకుని తండ్రి తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ నాగేంద్రలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 7427 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 306 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1760 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 650 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 178 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 387 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 3200 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

బీమా సంస్థ ఉద్యోగిపై కత్తితో దాడి

- నామినీ పేరు మార్పులో జాప్యమే కారణం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



చికిత్స పొందుతున్న పులిగడ్డ రాజేష్

లక్ష్మీపురం: బీమా కంపెనీ ఆపరేషన్ మేనేజర్‌పై కత్తితో దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అరండల్‌పేట 7/1 అడ్డరోడ్డులోగల కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీకి మంగళవారం ఉదయం పెదకాకాని శివాలయం రోడ్డుకు చెందిన కందుల శ్రీనివాసరావు వచ్చారు. ఆపరేషన్స్ మేనేజర్ పులిగడ్డ రాజేష్‌ను కలిసి బీమా పాలసీలో నామినీ పేరు తప్పుగా పడిందని చెప్పారు. పేరు సరి చేసేందుకు సుమారు 10 రోజులు పడుతుందని రాజేష్ బదులిచ్చారు. దీంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. శ్రీనివాసరావు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత మళ్లీ వచ్చి రాజేష్‌తో గొడవ పడ్డారు. కంప్యూటర్, లాప్‌టాప్, ఫర్నిచర్ ధ్వంసం చేసి రాజేష్‌పై కత్తితో దాడి చేశాడు. దీన్ని గమనించిన తోటి సిబ్బంది భయంతో పరుగులు తీశారు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట సీఐ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆళ్ళహరి శ్రీనివాసరావు, సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. కత్తి చేతిలో పట్టుకున్న నిందితుడు అరగంట సేపు హల్‌చల్ చేశాడు. రాజేష్‌ను బయటకు తీసుకొచ్చేందుకు వెళ్లిన పోలీసులను కూడా నిందితుడు బెదిరించాడు. ఎస్‌బీ సీఐ ఆళ్ళహరి శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ రైటర్ సుబ్రమణ్యంలకు చిన్నపాటి గాయం అయింది. అయినా వెనక్కి తగ్గకుండా నిందితుణ్ని అదుపులో తీసుకుని, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన రాజేష్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. కంపెనీ మేనేజర్ సింగంశెట్టి గోపి దీనిపై అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా ఓటర్లదే పైచేయి

- జిల్లాలో ఓటర్ల సంఖ్య 17,95,789
- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడి



గుంటూరు వెస్ట్: జిల్లాలో స్పెషల్ సమ్మరి రివిజన్ 2025కు సంబంధించి మంగళవారం ప్రకటించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రకారం మహిళా ఓటర్లే ఎక్కువ ఉన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 17,95,789 అని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఎస్ఎస్ఆర్ 2025తోపాటు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఓటర్ల నమోదుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువగా మహిళ ఓటర్లే ఉన్నారన్నారు. వీరి సంఖ్య 9,27,157 మంది కాగా, పురుషులు 8,66,710 మంది అన్నారు. ట్రాన్స్‌జండర్స్ 158 మంది, సర్వీస్ ఓటర్లు 1764 మంది ఉన్నారని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై వచ్చేనెల 28వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వచ్చే నెల 9, 10, 23, 24వ తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. డిసెంబరు 24వ తేదీ నాటికి క్లయిమ్స్, అభ్యంతరాలు పరిష్కరించి, వచ్చే ఏడాది జనవరి 26న తుది ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తామని వివరించారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, నూతన కేంద్రాలకు సంబంధించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో 36 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఆమోదించినట్లు చెప్పారు. ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,920కు చేరిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు 1,24,500 దరఖాస్తులు అందాయని తెలిపారు. నవంబరు 6న నమోదుకు చివరి తేదీగా పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఈఆర్వోలు గంగరాజు, లక్ష్మీకుమారి, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేసు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,000** గరిష్ఠం : రూ. **4,200**

మోడల్ ధర రూ. **3,600**

క్లుప్తంగా

దీపం-2 పథకానికి ఏజెన్సీలు సహకరించాలి



గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల 1 నుంచి దీపం-2 పథకాన్ని ప్రారంభించనుందని, దీనికి గ్యాస్ ఏజెన్సీ డీలర్లు సహకరించాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ కోరారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడారు. తొలి సిలిండర్ కోసం దరఖాస్తులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఏజెన్సీలు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మొదటి బుకింగ్ కాల వ్యవధి మంగళవారం నుంచి వచ్చే ఏడాది మార్చి 3 వరకు ఉన్నందున లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వినియోగదారుడు గ్యాస్ బుక్ చేసుకున్న తర్వాత రిజిస్టర్ మొబైల్‌కు మెసేజ్ వస్తుందన్నారు. సమావేశంలో డీఎస్ఓ కోమలి పద్మ కూడా పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



పట్నంబజారు: కార్తీక మాసం పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం స్పెషల్ బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి కరపత్రాలను మంగళవారం ఏపీఎస్ఆర్టీసీ గుంటూరు రీజినల్ మేనేజర్ ఎం.రవికాంత్ ఆవిష్కరించారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని ఆర్ఎం చాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, అమరావతి, శ్రీశైలం, యాగంటి, మహానంది వెళ్లాలనుకునే భక్తుల కోసం ఈ బస్సులను అందుబాటులో తీసుకొస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 73828 96403, 73828 97459 ఫోను నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు అబ్దుల్ సలాం, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ జట్లు ఎంపిక



ఎంపికైన బాలుర, బాలికల జట్లు

తెనాలి: గుంటూరు జిల్లా అండర్-19 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక మంగళవారం స్థానిక జేఎంజే మహిళా కళాశాలలో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జి.నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్ పద్మాకర్, కాలేజీ వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ అరుణ సుజాత, కేవీ ఖాసీం, రవీందర్, సీహెచ్ రంజిత్‌లు ఎంపిక పోటీలను జరిపారు. అనంతరం ఆయా జట్ల వివరాలను ప్రకటించారు. ఎంపికైన జిల్లా జట్లు నవంబరు 9, 10వ తేదీల్లో విజయవాడలోని పీబీ సిద్ధార్థ కాలేజీలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలియజేశారు. జేఎంజే కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ షైనీ కేపీ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

బాలుర జట్టు ఇదే..

పి.అమన్‌ఖాన్, ఎస్.అన్వేష్, ఆర్.అఖిల్, పి.కిరణ్‌బాబు (విజ్ఞాన్ కాలేజీ, వడ్లమూడి), డి.అనిల్, టి.నరసింహ (వాగ్దేవి జూనియర్ కాలేజీ, నరసరావుపేట), ఎస్.ధనుష్ (సీకే జూనియర్ కాలేజీ, మంగళగిరి), నాగుల్ షరీఫ్ (ఏపీఆర్‌జేసీ - ఉర్దూ, గుంటూరు), రాకేష్ (టీజేపీఎస్, గుంటూరు), శివగోపి (శ్రీచైతన్య, గుంటూరు), ఎంఆర్ విజయ్‌దీపక్ (శ్రీచైతన్య, బాపట్ల), కె.కార్తీక్ (అంబేడ్కర్ కాలేజీ, తెనాలి). స్టాండ్ బైస్: ఎం.రూపస్, దానియేలు జీవజయన్, ఎస్.వినోద్ కుమార్.

బాలికల జట్టు..

వై.చంద్రిక, సీహెచ్ దుర్గాప్రసన్న, సి.మాధవి, వి.ఇందు (జేఎంజే కాలేజీ), ఎస్కే రేష్మ (ప్రగతి కాలేజీ, సత్తెనపల్లి), ఎ.హర్షిత (ఎస్ఆర్ కాలేజీ, గుంటూరు), బీఎన్ శ్రావ్య (జీజేసీ, గుంటూరు), వై.లావణ్య (వైష్ణవి జూనియర్ కాలేజీ, తెనాలి), ఎం.శ్రీలక్ష్మి (వాగ్దేవి జూనియర్ కాలేజీ, నరసరావుపేట), సీహెచ్ ధాన్యశ్రీ (శ్రీచైతన్య కాలేజీ, బాపట్ల), కె.వల్లిశ్రీ (అంబేడ్కర్ గురుకులం, బాపట్ల), పి.తన్వి (జీఆర్‌సీఆర్‌కే, జడ్పీ హైస్కూలు, పెదకూరపాడు). స్టాండ్ బైస్: టి.అశ్విత, సీహెచ్ దీప్తి, పి.అనూష.

10న రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణమూర్తి, గురుదత్, శ్రీనివాస్, రాజేష్, ఉమాదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రుద్ర కళాక్షేత్రం సహకారంతో నవంబర్ 10వ తేదీన 'బాల కళాప్రభ' పేరుతో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు బాలానంద కేంద్ర అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం బ్రాడీపేటలోని బాలానంద కేంద్రంలో కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి వున్న సాంస్కృతిక కళా నైపుణ్యాలను వెలికితీయడానికి 1955లో బాలానంద కేంద్రాన్ని స్థాపించినట్లు తెలిపారు. వేల మందిని ఉత్తమంగా తీర్చిదిద్దామన్నారు. నవంబర్ 10న కృష్ణనగర్‌లోని లోటస్ ఆద్య పాఠశాలలో తెలుగు పద్యం, శాస్త్రీయ జానపద నృత్యాలు, చిత్రలేఖనం, సంస్కృత శ్లోకాలు, శాస్త్రీయ సంగీత (గాత్రం), జానపద, దేశభక్తి గీతాలు, వాద్య సంగీతం, కీబోర్డుల అంశాల్లో 3-6వ తరగతి వరకు జూనియర్స్, 7 - 10వ తరగతి వరకు సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పాఠశాలలకు సమాచారం పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలల దినోత్సవం రోజున విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు నవంబర్ 8వ తేదీలోపు వాట్సాప్ నంబర్లు 91863 85890, 89199 81839కు పాల్గొనే విద్యార్థుల వివరాలు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి నడింపల్లి గురుదత్, సహాయ కార్యదర్శి బి.శ్రీనివాస్, మాచిరాజు రాజేష్, రుద్రకళాక్షేత్ర కార్యదర్శి పీఎస్ఆర్ కిరణ్, అకడమిక్ డైరెక్టర్ ఉమాదేవి పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు జిల్లాలోని నాలుగు చోట్ల జాబ్‌మేళాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి అధికారి కె.రమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని మణిపురం ఫ్లైఓవర్ దిగువన ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, తుళ్లూరులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలోని నాక్ శిక్షణ కేంద్రం, చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెనాలి ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలోని నాక్ శిక్షణ కేంద్రాల్లో మేళాలు ఉంటాయన్నారు.

ప్రాచీన క్రీడలను కాపాడుకోవాలి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): సిలంబం (కర్రసాము) లాంటి ప్రాచీన క్రీడలను కాపాడుకోవడమే కాకుండా నేటి యువ తరానికి నేర్పాలని శాప్ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన ఈ నెల 27న సిలంబం స్టిక్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లోని విజేతలను అభినందించారు. రాష్ట్ర కార్యదర్శి డీఎస్ క్రిష్టోఫర్‌ను మెచ్చుకున్నారు. క్రీడా సంఘాలు క్రమం తప్పకుండా పోటీలు నిర్వహించాలని సూచించారు.

స్తంభంపైనే ప్రాణాలు విడిచిన ఎలక్ట్రీషియన్



విద్యుత్ స్తంభంపై దానియేల్ మృతదేహం

వేటపాలెం: స్తంభం ఎక్కి వీధిలైట్లు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతంతో కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందాడు. ఈ విషాద ఘటన మంగళవారం మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ వివేకానంద కాలనీలో జరిగింది. అందిన వివరాల మేరకు.. చల్లారెడ్డిపాలెం స్థానిక జబ్బార్ కాలనీకి చెందిన ఎస్ దానియేల్ (35) పంచాయతీ కాంట్రాక్టు కార్మికుడిగా పదేళ్లుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వివేకానంద కాలనీలో వీధిలైట్లు మరమ్మతుల కోసం దానియేల్ విద్యుత్ స్తంభాన్ని ఎక్కాడు. విద్యుత్ సరఫరా కావడంతో దానియేల్ షాక్‌కు గురై అక్కడికక్కడే స్తంభం మీదే ప్రాణాలు విడిచాడు. అంతకుముందు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపి, మరమ్మతులు చేయడానికి వచ్చాడని స్థానికులు తెలిపారు.

పుస్తకాల పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేయండి

గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాల పంపిణీకి ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో రేణుకను జిల్లా పాఠ్య పుస్తక విభాగ మేనేజర్ వి. వజ్రబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ.. పాఠ్య పుస్తకాలకు సంబంధించిన జిల్లా ఇండెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వజ్రబాబు మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల సూచనల మేరకు పాఠశాలలకు సకాలంలో పాఠ్య పుస్తకాలను అందించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతామని చెప్పారు. డీఈవోను కలిసిన వారిలో పాఠ్య పుస్తక విభాగ సీనియర్ అసిస్టెంట్ ఈవీ శ్రీనివాస్ ఉన్నారు.

అపార్ ఐడీ జనరేషన్‌లో ఇబ్బందులు తొలగించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: అపార్ ఐడీ జనరేషన్‌లో ఇబ్బందులు తొలగించాలని అఖిల భారత సెకండరీ ఉపాధ్యాయుల సమాఖ్య (ఏఐఎస్‌టీఎఫ్) జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకను ఆమె కార్యాలయంలో ఎస్‌టీయూ గుంటూరు జిల్లా శాఖ నాయకులతో వెళ్లి కలిశారు. ఆమెకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను డీఈవో దృష్టికి తెచ్చారు. అపార్ ఐడీల్లో తప్పులను సవరించుకునే అవకాశాన్ని ఎంఈవో, హైస్కూల్ హెచ్ఎంల లాగిన్‌కు ఇవ్వాలని కోరారు. ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు, ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శి ఎల్. వీరాంజనేయులు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్. రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. వరప్రసాద్‌రావు, రాష్ట్ర కార్యదర్శి కె.జోజప్ప, నాయకులు డీపీ జోసఫ్, బి. సురేష్, పి. ప్రసాద్, షేక్ బాజీ, సాలార్‌బేగ్ పాల్గొన్నారు.

ఏఎన్‌యూ దూరవిద్యలో ఎంబీఏ, ఎంసీఏ

- యూజీసీ డెబ్ నుంచి అనుమతి
- నవంబర్ 15 వరకు దరఖాస్తుకు గడువు



డెబ్ అనుమతి పత్రాలను చూపుతున్న వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం ద్వారా ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు నిర్వహించేందుకు యూజీసీ డెబ్ (డిస్టన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు అనుమతి పత్రాలను మంగళవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం తదితరులు చూపారు. దూరవిద్యా కేంద్రం అధికారులు మాట్లాడుతూ.. యూజీసీ అనుమతి ప్రకారం 2024-25 విద్యా సంవత్సరం నుంచే మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు నవంబరు 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీ ఐసెట్-2024 లేదా ఏఎన్‌యూ దూరవిద్యాకేంద్రం నిర్వహించే ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు ప్రవేశం పొందవచ్చన్నారు. కోర్సుల వ్యవధి రెండేళ్లు అని, నాలుగు సెమిస్టర్లుగా ఉంటాయన్నారు. దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్, కామర్స్ డీన్ ఆచార్య ఆర్.శివరామ ప్రసాద్, ఎన్.నాగేశ్వరరావు, వై.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా నారాయణరావు



డాక్టర్ నారాయణరావును సత్కరిస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వి.నారాయణరావు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గుంటూరు జీజీహెచ్‌లో సంఘం కేంద్ర కమిటీ నేతలు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ నారాయణరావును ఎన్నుకున్నట్లుగా తీర్మానం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు పదోన్నతి లభించి కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరారు. ప్రస్తుతం డాక్టర్ నారాయణరావు ఇప్పటివరకు ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా సంఘంలో కొనసాగుతున్నారు. ఇప్పుడు ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా డాక్టర్ గంగన్నను ఎన్నుకున్నారు. అనంతరం యూనియన్ నేతలు డాక్టర్ నారాయణరావును ఘనంగా సత్కరించారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు నమోదు

- హైకోర్టులో ఊరట
- రెండు వారాలపాటు చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశాలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ రూరల్ వైఎస్సార్ సీపీ నాయకులపై పోలీసులు టీడీపీ వారి ప్రోత్సాహంతో అక్రమ కేసులు బనాయించారు. ఆ కేసులలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, గుంటూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరెడ్డి, తాడేపల్లి రూరల్‌కు చెందిన జక్కిరెడ్డి వెంకటకృష్ణారెడ్డిలతో పాటు పలువురు నాయకులకు హైకోర్టు రెండు వారాల పాటు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. అప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు ఆదేశించింది. అక్రమ కేసుల్లో ఇబ్బందులకు గురి అవుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ... టీడీపీ నాయకులకు తమను రాజకీయంగా ఎలా ఎదుర్కోవాలో అర్థం కాక ఇలా అక్రమ కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ కార్యకర్తల రౌడీయిజం వల్ల కుంచనపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటరెడ్డి మృతి చెందారని తెలిపారు. అప్పట్లో పోలీసులు జరిగిన సంఘటనపై పొరపాటున కాదు, ఉద్దేశపూర్వకంగా రెచ్చగొడుతూ వెంకటరెడ్డిని ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో మృతి చెందారని కేసు నమోదు చేశారని గుర్తుచేశారు. ఆ కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న వ్యక్తి బెయిల్‌పై వచ్చిన 6 నెలల తరువాత ఎలాంటి ఆధారాలు లేకుండా తమపై అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. ఈ కేసులపై కోర్టులో న్యాయపోరాటం చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు.

కార్మికులపై వేధింపులు ఆపకుంటే ఉద్యమం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న ఫ్యాక్టరీ కార్మికులు, సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులపై అధికారుల వేధింపులు ఇలాగే కొనసాగితే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళవారం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పాశం రామారావు కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులను, యూనియన్ నాయకులు కూరపాటి స్టీఫెన్, ఎస్కే బాషా, వై. సుబ్బారావు, సూర్య ప్రకాష్, వెంకటరత్నం, ఆశీర్వాదం తదితరులను ఫ్యాక్టరీ స్థలం దగ్గరకు వచ్చి పోలీసులు తీసుకువెళ్లి ఎమ్మార్వో కార్యాలయం ముందు బైండ్ ఓవర్ చేయడంతో కార్మికులు భయభ్రాంతులకు గురి అయ్యారని అన్నారు. కార్మికులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు వేధింపులు ఆపాలని, కోర్టు తీర్పులను ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పోలీసు అధికారులు చేస్తున్న ఈ దుర్మార్గమైన చర్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సమస్యను పరిష్కరించకపోగా అక్రమ అరెస్టులకు దిగడం సరికాదని, ఇప్పటికైనా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయంగా రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. న్యాయమైన ఈ పోరాటానికి అన్ని ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రూరల్ పట్టణ కార్యదర్శులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వర్లు, సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కోటేశ్వరరావు, సుబ్బారావు, అప్పారావు, సాంబయ్య, రమాదేవి, నవనీతం, జానీ, బాషా, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషనులో వసతుల పరిశీలన

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంటూరు రైల్వే స్టేషన్‌లో దీపావళి రద్దీని పురస్కరించుకుని ప్రయాణికులకు సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. డీఆర్ఎం రామకృష్ణ ఉత్తర్వుల మేరకు తగిన ఏర్పాట్లు చేశామని డీసీఎం కమలాకర్‌బాబు అన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఆయన వసతులను పరిశీలించారు. ప్రయాణికులకు సమాచార కేంద్రం, రిజర్వేషన్ కౌంటర్లు, అనౌన్స్‌మెంట్ విభాగాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

నగరంపాలెం: రౌడీషీటర్ మరణించినట్లు నకిలీ ధ్రువీకరణ పత్రం సృష్టించిన కానిస్టేబుల్‌పై వేటు పడింది. పశ్చిమ సబ్ డివిజన్ పరిధిలోని పట్టాభిపురం పీఎస్‌లో గతంలో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన రాజును సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. వైఎస్ఆర్ సీపీ నగర అధ్యక్షుడు పాదర్తి రమేష్‌గాంధీ 2021లో మృతి చెందారు. గతంలో కృష్ణానగర్‌లో నివసించిన రౌడీషీటర్ పాదర్తి రమేష్‌పై కేసులు తొలగించేందుకు ఆయన మరణాన్ని ఉపయోగించుకుని పథకం రూపొందించాడు. ఈ క్రమంలో అతనిపై రౌడీషీట్ తొలగించేందుకు పాదర్తి రమేష్‌గాంధీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని కోర్టులో దాఖలు చేసిన విషయం విదితమే. దీంతో కానిస్టేబుల్ రాజును సస్పెండ్ చేశారు

సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలి

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని పలు విభాగాల్లోని పరిపాలన సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. పరిపాలన ఉద్యోగ, సిబ్బందికి విధులు మార్పు చేశారు. అనంతరం హాల్‌లో జరిగిన సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ఇంక్రిమెంట్లు, ఉద్యోగ విరమణ, మరణానంతర ప్రయోజనాలను సకాలంలో అందించాలని సూచించారు.